## నేటి కందం- నేటికి అందం

బంటుగ- సేవల నిడ నడి
మింటను వెలుగొందు రవిని-మించిన ధృతి-రే
కంటుని దలచుచు గొలిచెద
పంటలు పండించు నట్టి భరణీ కార్తెన్ !!

(27-4-25 భరణీ
కార్తె ప్రారంభం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

ఉగ్రవాద రహితంగా
ఉంటే విశ్వ భవితం
ఎందుకని విస్మరిస్తే
ఎక్కడైనా జ్వలితం
బలపరిచి ఎవరైనా
భావిస్తే తమ నేస్తం
బలిదీసుకును అది
భస్మాసుర హస్తం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 27-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:211 పేజీలు:6 వెల: రూ.1/-


## మిషన్ రెడీ.. పాక్‌కు భారత ఆర్మీ స్ట్రాంగ్ మెసేజ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పెహల్‌గామ్ ఉగ్రదాడి తో భారత్ - పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు భారత ఆర్మీ బలమైన సందేశాన్ని పంపింది. 'సిద్ధంగా.. అప్రమత్తంగా ఉన్నాం' అంటూ వీడియోను ఎక్స్‌లో పంచుకుంది. 'మిషన్ రెడీ.. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా. దేనికీ భయపడం. ఏదీ మమ్మల్ని ఆపదు. ఎల్లప్పుడూ సిద్ధంగానే..' అంటూ జవాన్ల విన్యాసాలకు సంబంధించిన వీడియోను పంచుకుంది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ వీడియో చూస్తుంటే పాక్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా, మంగళవారం మధ్యాహ్నం జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్‌లో ఆర్మీ దుస్తుల్లో అడవిలో నుంచి వచ్చిన ఉగ్రమూక పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. ఈ నరమేధంలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై భారత్ ఆగ్రహంతో ఉంది. పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఈ ఘటనకు పాల్పడిన వారికి కలలో కూడా ఊహించని రీతిలో శిక్ష ఉంటుందంటూ ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే.

దీనికి తోడు.. ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వద్ద దాయాదిదేశం కవ్వింపులకు పాల్పడుతోంది. భారత సైనికులపై కాల్పులు జరుపుతోంది. అయితే వాటిని భారత ఆర్మీ సమర్ధవంతంగా తిప్పికొడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్ ? పాక్ మధ్య యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయంటూ అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, భారత్ మాత్రం ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతో దాయాది దేశంపై భారత్ ఏ రకంగా ప్రతీకారం తీర్చుకోబోతోందన్న ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు భారత ఆర్మీ పెట్టిన పోస్ట్ ఈ ఆసక్తిని మరింత పెంచినట్లైంది.

## పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన

### - పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదు ..

న్యూ డిల్లీ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన చేసింది. మొదట ఈ దాడి తమ పనే అని ప్రకటించుకున్న ఆర్‌టీఎఫ్ .. ఇప్పుడు మాట మార్చింది. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదని తెలిపింది. ఈ మేరకు సంచలన ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది.తమ వ్యవస్థలి భారత్ హ్యాక్ చేసినట్లు ప్రకటనలో ఆరోపించింది. 'పెహల్‌గావ్ం ఘటనలో మా ప్రమేయం లేదు. ఈ చర్యను టీఆర్‌ఎఫ్‌కు ఆపాదించడం తొందరపాటు చర్యే అవుతుంది. ఇంతకు ముందు వచ్చిన ప్రకటనతో కూడా మాకు సంబంధం లేదు. భారత్ మా వ్యవస్థల్ని హ్యాక్ చేసి ఆ మెసేజ్ పోస్ట్ చేసింది. ఇది భారత సైబర్-ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పని. దీనిపై వేము పూర్తి దర్యాప్తు చేస్తున్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇలా చేయడం ఇదేమీ తొలిసారి కాదు' అంటూ ఆరోపించింది.మంగళవారం మధ్యాహ్నం జమ్ము కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. అడవిలో నుంచి వచ్చిన ఉగ్రమూక పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. ఈ దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి తమ పనే అని పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఇప్పుడు మాత్రం మాట మారుస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేయడం గమనార్హం.

## ప్రజల మాటే మా పాలనకు బాట : సీఎం రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 26:ప్రజల మాటే మా పాలనకు బాట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించామని, దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చామని, మహిళలను కోటీశ్వరులను చేయడమే అజెండాగా పెట్టుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని హెచ్?ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్?లో సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజలు తమ ప్రభుత్వంపై చాలా ఆశలు పెట్టుకున్నారని, సమాజంలో అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళుతుందని సీఎం చెప్పారు.

దేశంలో అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రైతులకు సుమారు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ గుర్తుచేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.12 వేలు ఇస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు.

నిరుద్యోగులకు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సీఎం రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్‌లో ప్రస్తావించారు. దక్షిణ కొరియా, దావోస్?లో పర్యటించి పెట్టుబడులను ఆకర్షించామని, రాజీవ్ యువ వికాసం కార్యక్రమంతో యువతకు ఉపాధి కల్పించబోతున్నామని సీఎం రేవంత్ వివరించారు. పారిశ్రామికవేత్తలతో పోటీ పడేలా తెలంగాణ మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని, దేశానికే రోల్ మోడల్?గా నిలిచే కులగణన చేపట్టామని సీఎం తెలిపారు.

### భారత్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ స్పీచ్ హైలైట్స్:

పదేండ్లలో తెలంగాణ ప్రజల కల నెరవేరలేదు
ప్రజల ఇష్టం ప్రకారం మా ప్రభుత్వం నడుస్తోంది
రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం
ఇది ఇండియాలో అతిపెద్ద రుణమాఫీ
రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం
సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం
పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నాం
సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తున్నాం
పదేండ్లల్లో నిరుద్యోగులను బీఆర్ఎస్ మోసం చేసింది
మేము వచ్చాక ఏడాదిలోనే 57 వేల ఉద్యోగాలిచ్చాం
ఇటీవల పెట్టుబడులతో 2 లక్షల ఉద్యోగాలు సాధించాం
సెల్ఫ్ హెల్త్ గ్రూపులను బలోపేతం చేస్తున్నాం
కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయబోతున్నాం
మొదటి ఏడాదిలో రూ.22 వేల కోట్ల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం
ఫ్రీ బస్సు స్కీంకు రూ.500 వేల కోట్లు ఖర్చు చేశాం
రాజీవ్ ఆరోగ్య శ్రీ మా పథకాల్లో మరో అద్భుతమైన పథకం
పేదలకు కార్పొరేట్ వైద్యం కోసం రూ.10 లక్షలు ఇస్తున్నాం
అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం
రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సమస్య వింటున్నాం
దీని కోసం ప్రజావాణిని నిర్వహిస్తున్నాం
మేము ఇటీవలే ఎస్సీ వర్గీకరణ చేశాం
థర్డ్ జెండర్‌ను పోలీస్ శాఖలో రిక్రూట్ చేసుకున్నాం
తలసరి ఆదాయంలో మేము టాప్‌లో ఉన్నాం

## యువతకు ఉపాధి అవకాశాల వృద్ధికి ప్రభుత్వ కృషి

### యువజనులకు కని విని ఎరగని అవకాశాలకు ఇదే తరుణం

### 15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

### రిక్రూట్లకు 51 వేల పైచిలుకు నియామక పత్రాలు పంపిణీ

న్యూఢిల్లీ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల వృద్ధి కొనసాగేలా తన ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో రిక్రూట్లకు 51 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేసిన అనంతరం 15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, యువజనులకు కనివిని ఎరగని అవకాశాల కల్పనకుఇదే తరుణమని అన్నారు. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చెప్పిందని, ప్రతి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని మోడీ తెలియజేశారు. ఆటోమొబైల్, పాదరక్షల పరిశ్రమల్లో ఉత్పత్తి, ఎగుమతి కొత్త రికార్డులు సృష్టించాయని, భారీ సంఖ్యలో ఉపాధి కల్పించాయని మోడీ వెల్లడించారు. తన ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, దేశీయ జల మార్గాల ద్వారా సరకుల రవాణా 2014లోని 18 మిలియన్ టన్నుల నుంచి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని, జాతీయ జలమార్గాలు ఐదు నుంచి పదికి, వాటి నిడివి 2700 కిమీ నుంచి 5000 కిమీకి చేరుకున్నాయని తెలియజేశారు. వృద్ధి సమ్మిళితం కావడమే భారీ హైలైట్ అని, మహిళల భాగస్వామ్యం ప్రతి రంగంలో పెరిగిందని ప్రధాని చెప్పారు.

ఈ ఏడాది యుపిఎస్‌సి పరీక్షలో ఐదుగురు అగ్రశ్రేణి అభ్యర్థుల్లో ముగ్గురు మహిళలని, 90 లక్షల స్వయంసహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జిలు)లో పది కోట్ల మందికి పైగా మహిళలు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. భారత మహిళా శక్తి అధికార యంత్రాంగం నుంచి రోదసి, వైజ్ఞానిక రంగాలలో కొత్త పుంతలు తొక్కుతున్నదని, గ్రామీణ మహిళల సాధికారతపై కూడా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తోందని ఆయన చెప్పారు.



ఈ దశాబ్దంలో టెక్నాలజీ, డేటా, ఆవిష్కరణల రంగాల్లో భారత వృద్ధికి యువత దోహదంచేసిందని, రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీల్లో దేశం అగ్రగామిగా ఉందని మోడీ తెలియజేశారు. దేశ నిర్మాణానికి యువత చురుకుగా తోడ్పడుతుండగా దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్నదని, ప్రపంచ వేదికపై గుర్తింపు పొందుతోందని ఆయన తెలిపారు.

దేశంలోని యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు వృద్ధి చెందేందుకు తన ప్రభుత్వం ప్రతి ఒక్క చర్యా తీసుకుంటున్నదని మోడీ చెప్పారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పథకాల గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, అవి యువతకు కొత్త అవకాశాలు సృష్టిస్తున్నాయని, వారి ప్రతిభ ప్రదర్శనకు బహిరంగ వేదిక అవుతున్నాయని తెలిపారు.

## ఇరాన్ ఓడరేవులో భారీ పేలుడు

### -300 మందికి పైగా గాయాలు



ఇరాన్ ఏప్రిల్ 26: బందర్ అబ్బాస్ నగరంలోని షాహిద్ రాజయీ ఓడరేవులో జరిగిన భారీ పేలుడులో 300 మంది గాయపడ్డారు. ఈ పోర్టులోని ఒక ఓడ నుంచి కంటైనర్ లు దిగుమతి చేస్తుండగా ఒక్కసారిగా ఈ కంటైనర్లు పేలిపోయాయి.. ఈ పేలుడు ప్రభావం ఒక కిలోమీటర్ వరకు పడింది.. పేలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.. దట్టమైన పొగలు ఆ ప్రాంతన్ని కమ్మేశాయి.. వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగ ప్రవేశం చేసి మంటలను ఆర్పుతున్నాయి..

సహాయ బృందాలు రంగ ప్రవేశం చేసి అక్కడ ఉన్న వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.. ఈ పేలుడు దాటికి ఒక కిలోమీటర్ల లోపు ఉన్న భవనాలలోని , కార్లలోని అద్దాలు పగిలిపోయాయి.. అనేక వందల మంది గాయపడ్డారు.. గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని హాస్పిటల్స్ కు తరలించారు.. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. చైనాలోని షాంఘై పోర్టు నుంచి వచ్చిన కంటైనర్లలో ఈ పేలుడు జరిగినట్లు అధికారులు గుర్తించారు.. ఈ కంటైనర్లలో సోడియం పెర్క్లోరేట్ ఉందని వెల్లడించారు.. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది..

## రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లిపోవాలి

### -నగరంలో ఉంటున్న పాకిస్తానీయులకు పోలీసులు నోటీసులు జారీ

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్ముకాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడిలో 28 మంది పర్యాటకులు మరణించడంతో భారత ఆర్మీ ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. భారత్ నుంచి పాకిస్థానీయులు వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో అన్ని రాష్ట్రాల్లో ఉన్న పాకిస్థానీయులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్ లో 213 మంది పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరంలో ఉంటున్న నలుగురు పాకిస్తానీయులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లిపోవాలని పోలీసులు హెచ్చరించారు.

## ఏఐఎన్‌పిఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాచన రఘునందన్

హైదరాబాద్, ఏప్రిల్ 26:(ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆలిండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గా మాచన రఘునందన్ ను నియమించారు. ఈ ఈ నియామకాన్ని జాతీయ అధ్యక్షులు మంజీత్ సింగ్ పటేల్ ఫోన్ ద్వారా తెలియపరిచారని రఘునందన్ చెప్పారు. దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు కొత్త పెన్షన్ పథకం లో ఉన్నారని రఘునందన్ స్పష్టం చేశారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో భాగస్వామ్య పింఛను పథకం అమలు ప్రారంభం అయ్యిందని,ఉద్యోగం అంటేనే ఒక సామాజిక భద్రత కాగా.. సి పి ఎస్ లో ఉన్న ఉద్యోగి కి ఆర్థిక భద్రత తో పాటు సామాజిక భద్రత కూడా ఉండదని రఘునందన్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాద వశాత్తు ఎవరైనా సి పి ఎస్ ఉద్యోగి కి అవాంఛనీయ సంఘటన కు గురైతే కనీసం లక్ష రూపాయలు కూడా వారి ఖాతా లో ఉండవని, అటువంటపుడు పెన్షన్ రాని ప్రభుత్వ ఉద్యోగం కన్నా ప్రైవేటు ఉద్యోగమే మిన్న అన్న భావన ను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారని రఘునందన్ అభిప్రాయపడ్డారు. వచ్చే నెల ఉత్తర ప్రదేశ్ లో జరిగే జోనల్ సమావేశానికి తనను ఆహ్వానించారని "మాచన" తెలిపారు.

## ఘనంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 26:ఉస్మానియా యూనివర్సిటీ 108వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే కేశవరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, పరిశోధనా రంగాల్లో ఓయూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆధునిక తెలంగాణ రూపకల్పనలో ఓయూ పాత్ర కీలకమైనదన్నారు. సమకాలీన స్థితుగతులు, పరిస్థితులకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇప్పటికీ అత్యుత్తమ విద్యాబోధనలో ఓయూ తన స్థానాన్ని నిలువుకుంటోందని, కానీ ఇది సరిపోదని అభిప్రాయపడ్డారు. ఓయూతో తనకున్న అనుబంధాన్ని పూర్వ విద్యార్థిగా ఇక్కడ తిరిగిన రోజులను గుర్తు చేసుకున్నారు.

గౌరవ అతిథిగా హాజరైన హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఓయూ విద్యార్థులు సమగ్ర ప్రతిభకు పర్యాయపదంగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు కీలక భూమిక పోషించే అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. తాను ఓయూ క్రికెట్ జట్టుతో పాటు బాస్కెట్ బాల్ జట్టులో సభ్యుడిగా ఆడిన రోజులను గుర్తు చేసుకున్నారు. అతి చిన్న వయసులో ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యానని చెప్పుకొచ్చారు. ఓయూకు రుణపడి ఉన్నానన్న ఆనంద్, ఏదైనా చేయాలని ఉందని తన మనసులోని మాటను బయటపెట్టారు. ఇందుకు అవసరమైన కార్యాచరణతో విశ్వవిద్యాలయ పాలకవర్గం ముందుకు రావాలని సూచించారు. ఓయూ దేశ స్థాయిలో రాణించేలా పాఠ్య ప్రణాళికల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. పోలీసు అధికారిగా రెండు వైపులా విశ్లేషణ చేసే అవకాశం తనకు ఉంటుందన్న ఆయన, ఓయూ ప్రతిష్టలో ఉపయోగపడే ప్రతి అవకాశాన్ని వదులుకోనని స్పష్టం చేశారు. తన తాత దూరదృష్టి పట్ల ఏడో నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ మనవడు నవాబ్ మీర్ నజాఫ్ అలీఖాన్ భావోద్వేగానికి లోనయ్యాడు. నిజాం వారసుడిగా ఉస్మానియా విజయాలను చూసి గర్విస్తున్నానని అన్నారు.

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. 1966లో ఏర్పాటైన కొఠారి కమిషన్ విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని చెప్పినప్పటికీ, నేటికీ ఈ కేటాయింపులు నాలుగు శాతానికి మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగంపై అజమాయిషీ చేయటానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. యూజీసీ నామమాత్రపు నిధులను కేటాయిస్తూ, సర్క్యులర్ల పేరుతో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని ప్రశ్నార్థకం చేస్తోందని వాపోయారు.



## చిన్నారుల ఆటాపాటలతో.. ఘనంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే



మెదక్, ఏప్రిల్ 26:దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వీఎన్ఆర్ గార్డెన్‌లో ఇవాళ దుబ్బాక ప్రాజెక్టు ఐసీడీఎస్ దౌల్తాబాద్ మండల స్థాయి అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అంగన్వాడీ పిల్లలు అతిథులకు పుష్ప గుచ్చం అందించి స్టేజి పైకి ఆహ్వానించారు.

అలాగే పిల్లల వెల్కమ్ సాంగ్ ప్రదర్శన చేసిన తర్వాత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ప్రీస్కూల్ మెటీరియల్ ప్రదర్శిస్తూ.. తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఆట, పాటల కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్కూల్ పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లల ఆటలు, పాటలు, నాటకీయ ప్రదర్శనలు చూసి చాలా మురిసిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ విధంగా పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడే యాక్టివిటీలు అంగన్వాడీ సెంటర్లలో చేయడం చాలా సంతోషకరమన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ , సీడీపీఓ ఎల్లయ్య , ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, మెడికల్ ఆఫీసర్ నాగరాజు , రిలయన్స్ డిస్టిక్ కోఆర్డినేటర్ రాజలింగం , పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటప్రసాద్, బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యాంసన్ ,రిలయన్స్ ఫౌండేషన్ బ్లాక్ కో ఆర్డినేటర్ భాస్కర్ , సరిత నాగరాజు, జిల్లా మహిళా సాధికారిక సంస్థ , దౌల్తాబాద్ మండలం సూపర్వైజర్ గిరిజ ,చంద్రకళ ,అంతుల్, రేణుక, స్వరూప, రాజేశ్వరి, హెల్త్ సూపర్ వైజర్ గీతబవని,లబ్దిదారులు ,పిల్లలు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు కథలు చెప్పే రోజులు రావాలి !

## (27 ఏప్రిల్ "జాతీయ కథలు చెప్పే దినోత్సవం" సందర్భంగా)

కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే "అనగనగా ఒక రాజు" అంటూ నీతి కథలు చెప్పేవాళు. అమ్మ, నాన్న, తాత, నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, నాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపే వారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆయా కుటుంబాల్లోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే ప్రయత్నాలు చేసేవారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న "జాతీయ కథలు చెప్పే దినోత్సవం" లేదా "నేషనల్ టెల్ ఏ స్టోరీ"ని పాటించడం ఆనవాయితీగా మారింది.

కథలు వినడం, చెప్పడం వల్ల పలు ప్రయోజనాలు:

కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవం నుంచి తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న పిల్లలు కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకోవడం ఒక సదాచారమే కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన "జాతీయ కథలు చెప్పే దినం" సందర్భంగా ప్రజలు కథలు ఇతరులకు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు, కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి.

మౌఖిక కథల నుంచి ఏఐ కథల వరకు..:

కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాతపూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్‌లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ స్ట్రాటజిస్టులు, పాడ్‌కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) కూడా ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది.

తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కథలను వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కూంబింగ్ వెంటనే నిలిపివేయాలి.. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



హైదరాబాద్, ఏప్రిల్ 26:శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదేపదే ప్రతిపాదిస్తున్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణమే కర్రెగుట్ట అడవుల్లో కూంబింగ్ నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు అంగీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా మారణహోమం చేయడం సరైన చర్య కాదన్నారు.

అణచివేత ఒక్కటే మార్గం కాదని వాటిని చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు మరోసారి చేసిన ప్రతిపాదనను పెడచెవిన పెట్టడం శ్రేయస్కరం కాదని సూచించారు. ఇప్పటికే మావోయిస్టులు పదుల సంఖ్యలో హతమైనట్లు వార్తలు వస్తున్నాయని, అలాగే పదుల సంఖ్యలో సాయుధ బలగాలు వడదెబ్బకు గురైనట్లు సమాచారం వస్తున్నదని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు.

# కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ-కాశ్మీర్‌లో పహల్‌గామ్‌లో అమాయక పౌరులనుఉగ్రవాదులు హత్య చేయడాన్ని ఖండించిన భారత జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:"కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ- కాశ్మీర్ లోని పహల్‌గామ్ ప్రాంతంలో- ధార్మిక విశ్వాసమేదో చెప్పాలని అడిగి మరీఉగ్రవాదులు ఈ నెల 22వ తేదీన 28 మంది పౌరులను కాల్చివేసిన ఘటన పట్ల భారత జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది.

కాశ్మీరు లోయలో విహారయాత్రకు వచ్చిన నిరాయుధులైన, అమాయక, సాధారణ పౌరులను తీవ్రవాదులు పొట్టన బెట్టుకోవడాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా ఖండించింది. నిరపరాధులూ, వారి కుటుంబాల మానవ హక్కుల్ని కాలరాసిన ఈ దుర్ఘటన- సవ్యదృష్టి కలిగిన ప్రతి మనిషినీ కదిలించివేసినట్లు పేర్కొంది.

ప్రపంచంలో మానవ హక్కుల ఉల్లంఘనకు అతి ప్రధాన కారణాల్లో తీవ్రవాదం ఒకటని అనేక సందర్భాల్లో అనేక నివేదికలు ఘోషిస్తున్నాయి. ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న, ఉసిగొలుపుతున్న, సమర్థిస్తున్న, ఉగ్రవాదం పెచ్చరిల్లడానికి కారణమైన వారిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యకు కారణమైన వారిని బాధ్యులుగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో దేశంలో ప్రజాస్వామ్యానికి తావులేకుండా పోవడంతోపాటు భయవిహ్వలతకు ఆస్కారం లభించినట్లవుతుంది. స్వేచ్ఛ, జీవించే హక్కు, సమానత్వం, సౌభ్రాతృత్వం, జీవిక వంటి మానవ హక్కులకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది.

బాధ్యులను గుర్తించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం. నేరగాళ్లను చట్టం ముందు నిలబెడుతుందనీ, అలాగే, ఈ దుర్ఘటనలో అసువులు బాసిన వారి కుటుంబాలకు సాంత్వన చేకూర్చేందుకు కూడా అవసరమైన రీతిలో చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం"

# తొలి 'టాప్ సెలెక్ట్స్' జాబితాను వెల్లడించిన వేవ్స్ బజార్.. 9 భాషల్లో 15 ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం నేపథ్యంగా, దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులు ఆకర్షణీయమైన కంటెంట్‌ను సృజించడం ద్వారా మీడియా, వినోద రంగంలో భారత్ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ముంబయిలో మే 1 నుంచి 4 వరకు నిర్వహించనున్న ప్రపంచ దృశ్య, శ్రవణ వినోద సదస్సు (వేవ్స్)- మీడియా, వినోద రంగంలో కీలక ఘట్టంగా నిలవబోతోంది. విస్తృత శ్రేణి కంటెంట్ సృజనకు, పెట్టుబడులకు గమ్యస్థానంగా, 'క్రియేట్ ఇన్ ఇండియా' అవకాశాలనూ అంతర్జాతీయ వ్యాప్తినీ పెంపొందించడానికి కీలక వేదికగా ఈ సదస్సు భారత్‌ను నిలపబోతోంది.

మీడియా, వినోద పరిశ్రమలో వేవ్స్ బజార్ ప్రధాన అంతర్జాతీయ మార్కెట్ వేదిక. అనుసంధానాన్నీ సహకారాన్నీ అభివృద్ధినీ పెంపొందించడానికి రూపొందించిన క్రియాశీల వేదిక ఇది. బయర్లు, సెల్లర్లు, విస్తృత శ్రేణి ప్రాజెక్టులు, నిపుణులతో భాగస్వామ్యాన్ని నిర్మించుకునే అవకాశాన్ని దర్శకులు, సినీ నిపుణులకు కల్పిస్తుంది. అలాగే వారి నైపుణ్యాలను చాటుకోవడానికి, వారి వృత్తిపరమైన నెట్వర్కును విస్తరించుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది.

వీక్షణ గది (వ్యూ రూమ్) అనేది మే 1 నుంచి 4 వరకు నిర్వహించనున్న వేవ్స్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన ఓ వేదిక. ప్రపంచవ్యాప్తంగా ఇటీవలే పూర్తయిన సినిమాలు, పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ప్రాజెక్టుల ప్రదర్శనకు దీనిని ఉపయోగిస్తారు. ఇవి చలనచిత్రోత్సవాలు, అంతర్జాతీయంగా విక్రయాలు, డిస్ట్రిబ్యూషన్ భాగస్వామ్యాలు, తుది నిర్మాణ నిధుల కోసం అవకాశాలను వెతుకుతున్న సినిమాలు.

సినిమా ప్రోగ్రామర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రపంచవ్యాప్త సేల్స్ ఏజెంట్లు, ఇన్వెస్టర్లు, ఈ రంగంలోని ఇతర నిపుణుల కోసం రూపొందించిన ఈ వ్యూయింగ్ రూమ్.. ప్రత్యేక వ్యూయింగ్ రూమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా వేవ్స్ బజార్‌ను సందర్శించే ప్రతినిధులు ఈ సినిమాలను చూడడానికి, ప్రాజెక్టు సమాచారాన్ని వివరంగా తెలుసుకోవడానికి, దర్శకులను నేరుగా కలవడానికి సంరక్షితమైన వాతావరణాన్ని నెలకొల్పుతుంది.

తొలి వేవ్స్ బజార్‌లో భారత్, శ్రీలంక, అమెరికా, స్విట్జర్లాండ్, బల్గేరియా, జర్మనీ, మారిషస్, యూఏఈ దేశాలకు చెందిన మొత్తం 100 చిత్రాలను వ్యూయింగ్ లైబ్రరీలో వీక్షించవచ్చు. ఈ మొత్తం జాబితా (లైనప్)లో ఎన్ఎఫ్‌డీసీ నిర్మించిన, సహనిర్మాణ బాధ్యతలు వహించిన 18 సినిమాలుండగా.. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఏఐ) పునరుద్ధరించిన 8 అపురూప చిత్రాలనూ ఇందులో జోడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ, పూణె), సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టీఐ, కలకత్తా) విద్యార్థుల 19 ప్రాజెక్టులు కూడా ఇందులో ఉన్నాయి.

వ్యూయింగ్ రూమ్ నుంచి వేవ్స్ బజార్ టాప్ సెలెక్ట్స్ విభాగానికి ఎంపికైన ఈ 15 ప్రాజెక్టుల్లో- 9 ఫీచర్ ప్రాజెక్టులు, 2 డాక్యుమెంటరీలు, 2 షార్ట్ ఫిల్మ్‌లు, 2 వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. మే 2న ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్‌లో జరిగే వేవ్స్ బజార్‌లో నిర్వహించే ఓపెన్ పిచింగ్ సెషన్‌లో తమ చిత్రాలను నిర్మాతలు, సేల్స్ ఏజెంట్లు, డిస్ట్రిబ్యూటర్లు, చలనచిత్రోత్సవ ప్రోగ్రామర్లు, పెట్టుబడిదారుల ఎదుట ప్రదర్శిస్తారు.

మీడియా, వినోద రంగాల్లో కీలకమైన కార్యక్రమమైన తొలి ప్రపంచ దృశ్య, శ్రవణ వినోద సదస్సు (వేవ్స్)ను ముంబయిలో మే 1 నుంచి 4 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. మీరు సంబంధిత రంగంలో నిపుణులైనా, పెట్టుబడిదారులైనా, సృజనకారులైనా, ఆవిష్కర్తలైనా... అనుసంధానం, భాగస్వామ్యం, ఆవిష్కరణలతో మీడియా, వినోద రంగంలో ప్రతిభను చాటుకునేందుకు అత్యున్నత అంతర్జాతీయ వేదికగా ఈ సదస్సు నిలుస్తుంది.

భారతీయ సృజన శక్తిని వేవ్స్ విస్తృతంగా చాటబోతోంది. కంటెంట్ సృజన, మేధో సంపత్తి, సాంకేతిక ఆవిష్కరణల నిలయంగా దేశ స్థానాన్ని మరింత సుస్థిరం చేయనున్నది. సమాచార ప్రసారం, ముద్రణ మాధ్యమాలు, టీవీ, రేడియో, సినిమా, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, సంగీతం, ప్రకటనలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికలు, ఉత్పాదక కృత్రిమ మేధ, అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఎక్స్ఆర్) వంటి పరిశ్రమలు, రంగాలపై దృష్టి సారించారు.

# బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీలకు అనూహ్య స్పందన : జిల్లా కలెక్టర్



అమరావతి, ఏప్రిల్ 26:రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే నగరమైన విజయవాడకు గుర్తింపు తెచ్చేందుకు నిర్వహించిన బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని, వినూత్న ఆలోచనలతో నూతన ఒరవడిని జతచేసి 200మందికి పైగా తమ ఎంట్రీలను పంపారని, ఔత్సాహికులకు మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఎంట్రీలకు మే10న చివరి తేదీగా నిర్ధారించినట్లు జరిగిందని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు.

విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీల నిర్వహణపై శనివారం జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ మాట్లాడుతూ? రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే నగరమైన విజయవాడకు దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించి, సరైన గుర్తింపు తెచ్చేందుకు బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీలను నిర్వహించాలనే ఆలోచన రావడం జరిగిందన్నారు. చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచే విధంగా నగరంపై ఉన్న ఆసక్తిని, ఆలోచనలను ప్రతిబింబించేలా టైటిల్, ట్యాగ్‌లైన్‌లను సూచించాలని, ఔత్సాహికుల నుంచి ఎంట్రీలను ఈ-మెయిల్ ద్వారా పంపాలని కోరామన్నారు. దరిమిలా ఇప్పటి వరకు దాదాపు 200కు పైగా ఎంట్రీల ద్వారా అత్యద్భుతమైన టైటిల్లను, ట్యాగ్‌లైన్లను ఔత్సాహికులు సూచించారన్నారు. వాటిని పరిశీలించడంతో మరింత ఉత్సాహం పెరిగి, మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మే10వ తేదీ ఎంట్రీలకు చివరితేదీగా నిర్ధారించామన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్‌ను Brandvjacomp.collectorntrdist@gmail.com మెయిల్ ఐడీకి పంపాలని, దీంతో పాటు పంపిన వారి పేరు, చిరునామా, మొబైల్ నంబరును తెలియజేయాలన్నారు. గడువు తేదీ అనంతరం విజయవాడ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచేలా అత్యుత్తమమైన టైటిల్, ట్యాగ్‌లైన్లను ఎంపిక చేయడం జరుగుతుందని, విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులతో పాటు వారికి సముచిత గుర్తింపు కల్పిస్తామన్నారు. పోటీల్లో పాల్గొని ఎంట్రీలు పంపిన ప్రతిఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అందజేయడం జరుగుతుందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

# దొంగలు అరెస్ట్.. రూ.25 లక్షల విలువైన అభరణాలు స్వాధీనం



కర్నూలు, ఏప్రిల్ 26: కర్నూల్ నగరంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ ఇంట్లో ఈనెల 13న జరిగిన దొంగతనం కేసులో నిందితులను పట్టుకొని మొత్తం సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనంకు వినియోగించిన రంపం, ఇనుప రాడ్లు, 2 మోటారు సైకిళ్ళు కూడా స్వాధీన పరుచుకున్నారు. తాళం వేసిన ఇళ్ళల్లో దొంగతనం చేసే విధానంపై యూట్యూబ్ లలో చూసి నేర్చుకున్నట్లు నిందితులు తెలిపారు.

సర్దార్ హుస్సేన్ తన కుటుంబంతో కలిసి ఓ ఫంక్షన్ కు హైదరాబాద్ కు వెళ్లగా షేక్షావలి (స్పైస్ డాభాలో పనిచేసే యువకుడు) తనతో పాటు మరో ఐదుగురు బాలురుతో కలిసి యూట్యూబ్ లో వీడియోలు చూసి తాళాన్ని విరగ్గొట్టి చోరీకి పాల్పడ్డారు. మరుసటిరోజు డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు కర్నూలు త్రీటౌన్ పీఎస్ లో కేసు నమోదు చేశారు. సాంకేతిక ఉపకరణాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. అయితే పూర్తి సమాచారం మేరకు కర్నూలుకు చెందిన షేక్షావలి అతనితో పాటు ఐదుగురు బాలురను నంద్యాల చెక్ పోస్టు దగ్గర ఉన్న కేంద్రీయ విద్యాలయం దగ్గర అదుపులోకి తీసుకుని వారిని సోదాచేయగా, వారి వద్ద నుండి దొంగతనం చేసిన సొత్తును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుండి దొంగతనానికి వాడిన రంపం, రాడ్డు, 2 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దొంగలను పట్టుకున్న కర్నూల్ డీఎస్పీ బాబు ప్రసాద్, కర్నూల్ మూడవ పట్టణ సీఐలు శేషయ్య, నాగ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, సుంకన్న, రంగారావు, పోలీసులు నాగరాజు, కిషోర్, నాగేశ్వరరావు, చంద్రబాబు నాయుడు, ఈ నాగరాజు, తిరుమలేశు, పరశురాముడు, వీరబాబు లకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రివార్డులు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ఇళ్ళకు తాళం వేసి ఊళ్ళకు వెళ్ళేటప్పుడు స్థానిక పోలీసు స్టేషన్లలో సమాచారం అందించాలన్నారు. ఎల్ హెచ్ ఎంఎస్ ఉపయోగించుకొని నిఘా పెట్టుకోవాలి. ఇళ్ళ చుట్టూ ముందు రోడ్డు బాగా కనపడేవిధంగా సీసీ కెమెరాలు అమర్చుకునేవిధంగా చేయాలని తెలిపారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ఆదిలాబాద్, ఏప్రిల్ 26:తేనె తీస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన కడెం మండలంలో చోటు చేసుకుంది.

కడెం పీఎస్ ఎస్ఐ యమ్ కృష్ణ సాగర్ రెడ్డి కథనం ప్రకారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ గ్రామానికి చెందిన కుర్ర మల్లేష్ (28) అనే వ్యక్తి తేనె కోసం కడెం మండలంలోని చిట్యాల్ అటవీ ప్రాంతంలోకి ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈనెల 25న రాత్రి వెళ్లారు.

ఈ క్రమంలో రాత్రి సమయంలో తేనె తీయడానికి 30మీటర్ల ఎత్తుగల తుమ్మ చెట్టుపైకి ఎక్కిన కుర్ర మల్లేష్ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి చనిపోయారని మృతిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఏపీకి రూ.1,121.20 కోట్లు విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం నిధులు తాజాగా విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా, మండల పరిషతులు అలాగే గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేసింది కేంద్ర సర్కార్. ఇందులో భాగంగానే 1121.20 కోట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది కేంద్ర సర్కార్. 2024 నుంచి 2025 సంవత్సరానికి గాను రెండో విడుదగా కేంద్రం నుంచి ఈ నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు అధికారిక ప్రకటన చేసింది కేంద్ర ప్రభుత్వం.

ఏపీకి 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఇప్పటికే అమరావతి కోసం ప్రత్యేక నిధులు వస్తున్నాయి. ప్రతినెలా అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేక నిధులు కూడా కేటాయిస్తోంది మోడీ సర్కార్. అలాగే త్వరలోనే ఏపీలో మెట్రో ప్రాజెక్టును విస్తరణ చేయబోతోంది. ఇలా అన్ని విధాల మోడీ సర్కార్.. ఏపీకి సహాయపడుతోంది.

# ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

కర్నూల్ ఏప్రిల్ 26: ఓ మహిళ ఛాతిలో నాలుగు కేజీల కణితిని గుర్తించిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అరుదైన ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఈ ఆపరేషన్ వివరాలను శనివారం హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. దాసరి బేబీ అనే 40ఏళ్ల మహిళ జొన్నగిరి డోన్ మండలం నివాసం.. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కాలేజీలో స్వీపర్ గా పనిచేస్తుంది.. ఆమెకు భర్త లేడు.. కష్టపడి బతుకుతున్న ఆమెకు అకస్మాత్తుగా ఓ కష్టం వచ్చింది. విపరీతమైన దగ్గు.. ఊపిరి ఆడేది కాదు.. దీంతో ఆమె కర్నూలు జీజీహెచ్ హాస్పిటల్లో వైద్యులను సంప్రదించింది. పరిశీలించిన వైద్యులు ఆమెను గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగానికి రెఫర్ చేసారు.

పరీక్షలు చేయగా ఆమె ఛాతిలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. అది ఎంత పెద్దగా ఉంది అంటే ఎడమవైపు ఛాతినంతా ఆక్రమించి గుండెను కూడా కుడివైపునకు తోసేసింది.. రక్తనాళాలను వాయునాళాన్ని కూడా గట్టిగా ఒత్తేస్తుంది దాని వలన ఆమెకు సమస్యలు వచ్చాయి. ఈమెకు ఎక్స్రే, సిటీ స్కాను, ఎమ్మారై లాంటి పరీక్షలు చేసి జాగ్రత్తగా ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. కానీ అంత పెద్ద గడ్డను ఎలా తీయగలమో ఏమైనా సమస్య వస్తుందా అని కొంచెం ముందు వెనక ఆలోచించి పేషంట్ కు ధైర్యం చెప్పి ఆపరేషన్ పూనుకున్నారు.

ఎందుకంటే ఇది చాలా ఖరీదైన ఆపరేషన్, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్తోమత ఆమెకు లేదు. ఎన్టీఆర్ వైద్య సేవలో కూడా కొంత డబ్బుతో చేయవచ్చని గ్రహించిన వైద్యులు ఈనెల 22న ఈమెకు ఈ క్లిష్టమైన ఆపరేషన్ చేసి గడ్డను పూర్తిగా తొలగించడం జరిగింది. పేషెంట్ కొంచెం రికవరీ కష్టమైనా కానీ బాగా కోలుకొని డిశ్చార్జ్ చేయడానికి రెడీ అయింది. ఎన్టీఆర్ వైద్యసేవ అనే ఈ పథకం చాలా మంది పేదలకు ఉపయోగపడుతూ ఉంటుంది. దీనివలన ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూల్ లో ప్రతి నెలా 15మంది దాకా పెద్ద బైపాస్ ఆపరేషన్లు చేయించుకొని సంతోషంగా ఇళ్లకు వెళుతూ ఉండడం విశేషం.

# వసతి గృహంలోఎలుకల దాడి - 10 మంది విద్యార్థినులకు గాయాలు

అమరావతి, ఏప్రిల్ 26:అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల వసతిగృహంలో విద్యార్థినులపై ఎలుకలు దాడి చేశాయి. ఈ ఘటనలో పది మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని బయటకు రాకుండా ప్రిన్సిపాల్ గోప్యంగా ఉంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థినులకు గోప్యంగా వ్యాక్సిన్ వేయించారు. విద్యార్థినులు నిద్రిస్తున్నప్పుడు ఎలుకలు కొరికాయి. హాస్టల్ చుట్టుపక్కల అపరిశుభ్ర వాతావరణ వల్ల రూమ్ లోకి ఎలుక లు వస్తున్నాయని విద్యార్థినులు వాపో తున్నారు. నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనంలో ఎలుకల బెడద ఉందని చెబుతున్నారు. కాగా, విద్యార్థినులు బయట నుంచి స్నాక్స్ తీసుకొస్తు ఉడటంతోనే ఎలుకలు వస్తున్నాయని కాలేజీ ప్రిన్సిపల్ సత్యలత, వార్డెన్ సౌగంధిక తెలిపారు. ఎలుకల బెడదను నివారించేందుకు హాస్టల్ రూమ్‌లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించామని కాలేజీ యాజమాన్యం పేర్కొంది.

# వైమానిక పరిమితుల మధ్య ప్రయాణీకుల నిర్వహణ చర్యలను అమలు చేయాలని ప్రభుత్వం విమానయాన సంస్థలను ఆదేశించింది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:ఇటీవల అంతర్జాతీయ గగనతల మూసివేతలు మరియు ఓవర్‌ఫ్లైట్ పరిమితుల దృష్ట్యా, అనేక విమాన మార్గాలను గణనీయంగా మార్చారు, దీని ఫలితంగా విమానాల వ్యవధి పొడిగించబడింది మరియు సాంకేతికంగా ఆగే అవకాశం ఉంది. ప్రయాణీకుల సౌకర్యం, భద్రత మరియు నియంత్రణ సమ్మతిని కొనసాగించడానికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ఆఉఅం) అన్ని విమానయాన ఆపరేటర్లను తక్షణమే అమలులోకి వచ్చేలా మెరుగైన ప్రయాణీకుల నిర్వహణ చర్యలను అమలు చేయాలని ఆదేశించారు.

పారదర్శక కమ్యూనికేషన్: ప్రయాణీకులకు రూట్ మార్పులు, పొడిగించిన ప్రయాణ సమయాలు మరియు వారి ప్రయాణంలో ఏవైనా సాంకేతిక ఆగిపోవడం గురించి ముందుగానే తెలియజేయాలి. ఈ కమ్యూనికేషన్ చెక్-ఇన్, బోర్డింగ్ మరియు డిజిటల్ హెచ్చరికల ద్వారా జరగాలి.

మెరుగైన ఇన్-ఫ్లైట్ సేవలు: విమానయాన సంస్థలు వాస్తవ బ్లాక్ సమయం ఆధారంగా క్యాటరింగ్‌ను సవరించాల్సి ఉంటుంది, తగినంత ఆహారం, హైడ్రేషన్ మరియు ప్రత్యేక భోజనం లభ్యతను విమానం అంతటా నిర్ధారిస్తాయి, ఏదైనా సాంకేతిక స్టాప్‌ఓవర్‌లతో సహా.

వైద్య సంసిద్ధత: క్యారియర్‌లు ఆన్‌బోర్డ్ వైద్య సామాగ్రి తగినంతగా ఉన్నాయని నిర్ధారించుకోవాలి మరియు సంభావ్య సాంకేతిక హాల్ట్ విమానాశ్రయాలలో అత్యవసర సేవల లభ్యతను ధృవీకరించాలి.

కస్టమర్ సపోర్ట్ సంసిద్ధత: కాల్ సెంటర్లు మరియు కస్టమర్ సర్వీస్ బృందాలు ఆలస్యం, తప్పిపోయిన కనెక్షన్‌లను నిర్వహించడానికి మరియు వర్తించే నిబంధనల ప్రకారం సహాయం లేదా పరిహారం అందించడానికి సిద్ధంగా ఉండాలి.

కార్యాచరణ సమన్వయం: విమాన కార్యకలాపాలు, కస్టమర్ సర్వీస్, గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఇన్‌ఫ్లైట్ సేవలు మరియు వైద్య భాగస్వాముల మధ్య సజావుగా సమన్వయం అవసరం.

ఈ ఆదేశాన్ని తప్పనిసరి అని పరిగణించాలని అన్ని విమానయాన సంస్థలను కోరింది. పాటించడంలో విఫలమైతే వర్తించే పౌర విమానయాన అవసరాల (అంఖీ) కింద నియంత్రణ చర్య తీసుకోవచ్చు. ఈ ఆదేశం వెంటనే అమలులోకి వస్తుంది మరియు తదుపరి నోటీసు వచ్చే వరకు అమలులో ఉంటుంది.

# ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

కర్నూల్ ఏప్రిల్ 26: ఓ మహిళ ఛాతిలో నాలుగు కేజీల కణితిని గుర్తించిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అరుదైన ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఈ ఆపరేషన్ వివరాలను శనివారం హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు.

దాసరి బేబీ అనే 40 ఏళ్ల మహిళ జొన్నగిరి డోన్ మండలం నివాసం.. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కాలేజీలో స్వీపర్ గా పనిచేస్తుంది.. ఆమెకు భర్త లేడు.. కష్టపడి బతుకుతున్న ఆమెకు అకస్మాత్తుగా ఓ కష్టం వచ్చింది. విపరీతమైన దగ్గు.. ఊపిరి ఆడేది కాదు.. దీంతో ఆమె కర్నూలు జీజీహెచ్ హాస్పిటల్లో వైద్యు లను సంప్రదించింది. పరిశీలించిన వైద్యులు ఆమెను గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగానికి రెఫర్ చేసారు.

పరీక్షలు చేయగా ఆమె ఛాతిలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. అది ఎంత పెద్దగా ఉంది అంటే ఎడమవైపు ఛాతినంతా ఆక్రమించి గుండెను కూడా కుడివైపునకు తోసేసింది.. రక్తనాళాలను వాయునా ళాన్ని కూడా గట్టిగా ఒత్తేస్తుంది దాని వలన ఆమెకు సమస్యలు వచ్చాయి.

ఈమెకు ఎక్స్రే, సిటీ స్కాను, ఎమ్మారై లాంటి పరీక్షలు చేసి జాగ్రత్తగా ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. కానీ అంత పెద్ద గడ్డను ఎలా తీయగలమో ఏమైనా సమస్య వస్తుందా అని కొంచెం ముందు వెనక ఆలోచించి పేషంట్ కు ధైర్యం చెప్పి ఆపరేషన్ పూనుకున్నారు.



# స్క్రామ్ జెట్ ఇంజిన్ అభివృద్ధిలో కీలక మైలురాయిని సాధించిన డీఆర్డీవో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో)కు చెందిన హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్డీఎల్) హైపర్సోనిక్ ఆయుధ సాంకేతిక రంగంలో కీలకమైన మైలురాయిని చేరుకుంది. హైదరాబాద్‌లో కొత్తగా నిర్మించిన అత్యాధునిక స్క్రామ్‌జెట్ కనెక్ట్ టెస్ట్ కేంద్రంలో డీఆర్డీఎల్ 1,000 సెకన్లకు పైగా దీర్ఘకాలిక యాక్టివ్ కూల్డ్ స్క్రామ్‌జెట్ సబ్‌స్కేల్ కంబస్టర్ గ్రౌండ్ టెస్టింగ్ ను ఏప్రిల్ 25న నిర్వహించింది. ఈ ఏడాది జనవరిలో 120 సెకన్ల పాటు నిర్వహించిన పరీక్షకు కొనసాగింపుగా ఈ గ్రౌండ్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో, ఈ వ్యవస్థ.. పూర్తి స్థాయి వైమానిక వినియోగయోగ్యమైన దహన యంత్ర పరీక్షకు త్వరలోనే సిద్ధం కానుంది.

హైపర్సోనిక్ క్రూయిజ్ క్షిపణి ధ్వని వేగం కన్నా అయిదు రెట్లు ఎక్కువ వేగంతో (ఁ 6100 గంటకు కి.మీ.) ఎక్కువ సమయం ప్రయాణించగల ఆయుధాల కోవకు చెందినది. దహన ప్రక్రియ కోసం గాలిని వినియోగించుకునే ఇంజిన్లతో (ఎయిర్ బ్రీతింగ్ ఇంజిన్లు) ఇది పనిచేస్తుంది. సూపర్‌సోనిక్ దహన సామర్థ్యం కలిగిన ఎయిర్ బ్రీతింగ్ చోదక వ్యవస్థలు క్రూయిజ్ దీర్ఘకాలం సాగడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీర్ఘకాలిక స్క్రామ్‌జెట్ దహన యంత్రం రూపకల్పన, అలాగే పరీక్ష కేంద్ర సమర్థతను ఈ పరీక్ష ధ్రువీకరించింది. పరిశ్రమలు, విద్యాసంస్థలుతోపాటు డీఆర్డీవో ప్రయోగశాలల సమష్టి కృషికి ఫలితమిది. దేశ హైపర్సోనిక్ క్రూయిజ్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమానికి బలమైన పునాదిగా ఇది నిలుస్తుంది.

విశేషమైన విజయాన్ని సాధించిన డీఆర్డీవో, పారిశ్రామిక భాగస్వాములు, విద్యాసంస్థలను రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ అభినందించారు. దేశం కోసం కీలకమైన హైపర్‌సోనిక్ ఆయుధ సాంకేతికతలను సాకారం చేయడంలో ప్రభుత్వ బలమైన నిబద్ధతకు నిదర్శనంగా ఈ విజయాన్ని ఆయన అభివర్ణించారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 1,000 సెకన్లకు పైగా సూపర్‌సోనిక్ దహన ప్రక్రియను ప్రదర్శించినందుకుగాను డైరెక్టర్ జనరల్ (క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థలు) శ్రీ యు. రాజా బాబు, డీఆర్డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎ. శ్రీనివాస మూర్తి, బృంద సభ్యులందరికీ రక్షణ పరిశోధన–అభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇద్దరి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ మోహన్ సింగ్

ఆదిలాబాద్, ఏప్రిల్ 26:బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు యత్నించిన ఇద్దరు మహిళలను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించాడు మోహన్ సింగ్. శుక్రవారం తన విధుల్లో భాగంగా కానిస్టేబుల్ మోహన్ సింగ్ గోదావరి నది నిజామాబాద్ వైపు విధులు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం కోస్లికి చెందిన బండారి లక్ష్మి, నవీపేటకు చెందిన సాయమ్మ ఇంట్లో కుటుంబ సమస్యల కారణంగా గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించగా కానిస్టేబుల్ మోహన్ సింగ్ వారికి ధైర్యం చెప్పి, పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లాడు.

ఎస్సై సంజీవ్ ఇరుకుటుంబాల సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి ఇద్దరిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయని కుటుంబాలలో వాటిని పరిష్కరించుకోవాలని ఎస్ఐ సూచించారు. ఇద్దరు మహిళలను కాపాడిన మోహన్ సింగ్ ను పోలీసులు, స్థానికులు అభినందించారు.

# భారతదేశం అంతటా గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:కేరళ రాష్ట్రంలోని ప్రముఖ వార్తా దినపత్రిక అయిన జన్మభూమి డైలీ నిర్వహించిన ఉద్యోగ్ వికాస్ కార్యక్రమంలో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ ఉద్యోగ్ వికాస్ అవార్డుతో సత్కరించబడింది. ఈ కార్యక్రమానికి భారీ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ హాజరయ్యారు, భారతదేశం అంతటా అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వం యొక్క దృఢమైన నిబద్ధతను ఆయన హైలైట్ చేశారు.

తన ప్రసంగంలో, శ్రీ వర్మ పాలక్కాడ్‌లోని ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ యొక్క పరివర్తన సామర్థ్యాన్ని ప్రశంసించారు, ఈ ప్రాజెక్ట్ కేరళ మరియు దేశంలోని విస్తృత దక్షిణ ప్రాంతం యొక్క మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక దృశ్యాన్ని పునర్నిర్మించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంపై దృష్టి సారించే సాంకేతిక సెషన్ కూడా ఉంది, ఇది రాబోయే పాలక్కాడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ యొక్క వ్యూహాత్మక దృష్టి, ప్రణాళిక మరియు పురోగతిపై లోతైన అంతర్దృష్టులను అందిస్తుంది. ఔఎఅఅ లాజిస్టిక్స్ డేటా సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిన ఒక ప్రత్యేక సెషన్, లాజిస్టిక్స్ డేటా బ్యాంక్ మరియు యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ ద్వారా అమలు చేయబడుతున్న వినూత్న డిజిటల్ పరిష్కారాల గురించి మరింత వివరించింది.

# గ్రామీణ మహిళల సాధికారతపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రసంగించారు మరియు వివిధ ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థలలో కొత్తగా నియమితులైన యువతకు 51,000 కి పైగా నియామక లేఖలను ఈరోజు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, భారత ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో ఈ యువతకు కొత్త బాధ్యతల ప్రారంభం ఈరోజు అని ఆయన నొక్కి చెప్పారు. దేశ ఆర్థిక చక్రాన్ని బలోపేతం చేయడం, అంతర్గత భద్రతను బలోపేతం చేయడం, ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణానికి దోహదపడటం మరియు కార్మికుల జీవితాల్లో పరివర్తనాత్మక మార్పులు తీసుకురావడం వారి విధుల్లో ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వారు తమ బాధ్యతలను నెరవేర్చడంలో నిజాయితీ భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ యువకులు తమ విధులను అత్యంత అంకితభావంతో నిర్వహిస్తారని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

"ఏ దేశ పురోగతి మరియు విజయానికి పునాది దాని యువతలోనే ఉంది, యువత దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నప్పుడు, దేశం వేగవంతమైన అభివృద్ధిని అనుభవిస్తుంది మరియు ప్రపంచ వేదికపై దాని గుర్తింపును స్థాపించుకుంటుంది" అని శ్రీ మోదీ నొక్కి చెప్పారు. "భారత యువత తమ కృషి మరియు ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి తమ అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు" అని ఆయన మరింత నొక్కిచెప్పారు, ప్రభుత్వం ప్రతి అడుగులోనూ దేశ యువతకు ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతూనే ఉండేలా చూస్తోందని అన్నారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా మరియు డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని ఆయన ఎత్తి చూపారు.

ఈ ప్రచారాల ద్వారా, భారత యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి ప్రభుత్వం ఒక బహిరంగ వేదికను అందిస్తోంది. ఈ ప్రయత్నాల ఫలితంగా, ఈ దశాబ్దంలో, భారతదేశ యువత సాంకేతికత, డేటా మరియు ఆవిష్కరణ రంగాలలో దేశాన్ని ముందంజలో ఉంచారని శ్రీ మోదీ పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో యువత ఎలా పరివర్తనాత్మక మార్పులకు నాయకత్వం వహిస్తున్నారో ప్రదర్శించే జఖఐ, ఎౌఆఆ మరియు ఉవఓ (ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్) వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల విజయాన్ని ఆయన హైలైట్ చేశారు. భారతదేశం ఇప్పుడు రియల్-టైమ్ డిజిటల్ లావాదేవీలలో ప్రపంచాన్ని నడిపిస్తుందని మరియు ఈ విజయంలో గణనీయమైన వాటా యువతకు దక్కుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

"ఈ బడ్జెట్‌లో ప్రకటించిన తయారీ మిషన్, 'మేక్ ఇన్ ఇండియా' చొరవను ప్రోత్సహించడం మరియు భారతదేశ యువతకు ప్రపంచవ్యాప్తంగా ప్రామాణిక ఉత్పత్తులను సృష్టించే అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవ దేశవ్యాప్తంగా లక్షలాది MSMEలు మరియు చిన్న వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా కొత్త ఉపాధి అవకాశాలను కూడా తెరుస్తుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు, ఇది భారతదేశ యువతకు అపూర్వమైన అవకాశాల సమయం అని అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉంటుందని m IMF ఇటీవల పేర్కొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వృద్ధికి బహుళ కోణాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశాలు పెరగడం అత్యంత ముఖ్యమైనదని ఆయన నొక్కి చెప్పారు. ఇటీవలి కాలంలో, ఆటోమొబైల్ మరియు పాదరక్షల పరిశ్రమలు ఉత్పత్తి మరియు ఎగుమతుల్లో కొత్త రికార్డులు సాధించాయని, యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించాయని ప్రధానమంత్రి ఎత్తి చూపారు.

ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు తొలిసారిగా ?1.70 లక్షల కోట్ల టర్నోవర్‌ను అధిగమించాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టించాయని ఆయన హైలైట్ చేశారు. 2014 కి ముందు, ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఏటా 18 మిలియన్ టన్నుల కార్గో మాత్రమే తరలించబడిందని ఆయన గుర్తు చేశారు. ఈ సంవత్సరం, కార్గో తరలింపు 145 మిలియన్ టన్నులను దాటింది. ఈ విజయానికి భారతదేశం స్థిరమైన విధాన రూపకల్పన మరియు నిర్ణయం తీసుకోవడం కారణమని ఆయన పేర్కొన్నారు. దేశంలో జాతీయ జలమార్గాల సంఖ్య కేవలం 5 నుండి 110 కి పెరిగిందని మరియు ఈ జలమార్గాల కార్యాచరణ పొడవు సుమారు 2,700 కిలోమీటర్ల నుండి దాదాపు 5,000 కిలోమీటర్లకు పెరిగిందని ప్రధానమంత్రి హైలైట్ చేశారు. ఈ విజయాలు దేశవ్యాప్తంగా యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని ఆయన నొక్కి చెప్పారు.

# సహకార పాల ఉత్పత్తి మరియు ఇతర ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లోకి తీసుకురావడం కోసం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భూటాని సహకార పాల ఉత్పత్తి మరియు ఇతర ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లోకి తీసుకురావడం కోసం సహకార మంత్రిత్వ శాఖ మరియు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మధ్య అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

ఈ ఒప్పందంపై ఏప్రిల్ 25, 2025 శుక్రవారం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓ శ్రీ అమితేష్ ఝా మరియు సహకార మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ డి కె వర్మ సంతకం చేశారు.

ఈ ఒప్పందంపై సంతకం చేయడం వల్ల సహకార సంస్థలు కొత్త యుగ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా కొత్త యుగ వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి వీలు కలుగుతుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో, సహకార మంత్రిత్వ శాఖ దేశంలోని సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి 60 కి పైగా కార్యక్రమాలను చేపట్టింది.

సహకార రంగం నుండి సేంద్రీయ ఉత్పత్తులతో సహా సహకార ఉత్పత్తులకు మార్కెట్ ప్రాప్యతను అందించడానికి మంత్రిత్వ శాఖ ఇటీవల అనేక కార్యక్రమాలను చేపట్టింది.

అవగాహన ఒప్పందం తర్వాత, భారత్ ఆర్గానిక్స్ మరియు ఇతర సహకార పాల ఉత్పత్తులు ఇప్పుడు స్విగ్గీ యొక్క ఇ-కామర్స్ మరియు న-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంటాయి.

ఈ అవగాహన ఒప్పందం స్విగ్గీ యొక్క డిజిటల్ ప్లాట్‌ఫామ్ మరియు ఔట్రీచ్‌ను ఉపయోగించడం ద్వారా భారతదేశంలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ భాగస్వామ్యం స్విగ్గీ యొక్క ఇన్‌స్టామార్ట్ ప్లాట్‌ఫామ్‌లో సహకార పాల ఉత్పత్తుల ఆన్‌బోర్డింగ్‌ను ప్రోత్సహిస్తుంది మరియు ప్రాధాన్యత గల యాక్సెస్‌కు మద్దతును అందిస్తుంది, సహకార సంస్థలకు ఎక్కువ దృశ్యమానత మరియు చేరువను నిర్ధారిస్తుంది.

మార్కెటింగ్, ప్రమోషన్, వినియోగదారు సాంకేతికత మరియు సామర్థ్య నిర్మాణం వంటి రంగాలలో సహకార బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడానికి స్విగ్గీ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేస్తుంది. స్విగ్గీ ప్లాట్‌ఫాంలో ఒక ప్రత్యేక "సహకార" వర్గం సృష్టించబడుతుంది, ఇది సేంద్రీయ ఉత్పత్తులు, పాడి, చిరుధాన్యాలు, హస్తకళలు మరియు సహకార సంస్థలు అభివృద్ధి చేసి ప్రోత్సహించే ఇతర ఉత్పత్తులపై దృష్టి పెడుతుంది.

ఈ సహకారం సహకార సంస్థలు కొత్త యుగ వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి వీలు కల్పిస్తుంది, తద్వారా వారి డిజిటల్ పాదముద్రను విస్తరిస్తుంది మరియు వారి మార్కెట్ ఉనికిని పెంచుతుంది.

ఐక్యరాజ్యసమితి 2025 ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో, స్విగ్గీ, సహకార మంత్రిత్వ శాఖతో కలిసి, దేశవ్యాప్తంగా సహకార ఉద్యమాలు, సంస్థలు మరియు ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఒక అవగాహన ప్రచారంలో పాల్గొంటుంది.

24 ఏప్రిల్ 2025న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఔఅూఒ) యొక్క అత్యాధునిక ప్యాకేజింగ్ సౌకర్యాన్ని సహకార కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భూటాని ప్రారంభించారు,

ఇది పప్పుధాన్యాల ప్యాకేజింగ్ మరియు అధిక పరిశుభ్రత మరియు నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే విస్తృత శ్రేణి సేంద్రీయ ఆహార ఉత్పత్తులకు అంకితం చేయబడింది.

# యూపీఎస్సీలో 68వ ర్యాంకు సాధించిన సాయి చైతన్యకు సన్మానం



ఆదిలాబాద్, ఏప్రిల్ 26:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు జాదవ్ కుమారుడు సాయి చైతన్య సివిల్స్ లో 68వ ర్యాంకు సాధించడంతో సన్మానం చేశారు. శనివారం ఉట్నూర్ లో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో తన నివాసంలో సాయి చైతన్యకు ఆయన తల్లిదండ్రులు గోవిందరావులకు శాలువాలతో సన్మానించారు.

సాయి చైతన్య ఐఏఎస్ కు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని, లంబాడ గిరిజన బిడ్డ ర్యాంక్ సాధించడం గర్వనీయమని రితీష్ రాథోడ్ అన్నారు. చదువుకున్న ప్రతి యువకుడు పట్టుదలతో సాయి చైతన్య లాగా కృషి చేస్తే ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో రాణించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆదిలాబాద్ బీజేపీ జిల్లా కార్యదర్శి కొందెరి రమేష్, బీజేపీ జిల్లా నాయకులు శ్రీపతి లింగ గౌడ్, బీజేపీ మండల నాయకులు బింగి వెంకటేష్, జాదవ్ రవీందర్, పెంట కైలాస్, సంపంగి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం : పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్



కరీంనగర్, ఏప్రిల్ 26: అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 ఃఔూ సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా గోదావరిఖని లోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని 1 టౌన్, రామగుండంసర్కిల్ సివిల్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు.

ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డిసిపి కర్ణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది తో మాట్లాడారు.

ఈ సందర్భంగా డీసీపీ మాటాడుతూ... ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి వివరించారు.

మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతల కు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది.. ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు.. అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు.

మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టీస్ చేపించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని సబ్ గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కుంభమేళాకు తరలిరండి.. బాల్క సుమన్



కరీంనగర్, ఏప్రిల్ 26: టిఆర్ఎస్ పురుడు పోసుకొని 25వ సంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 27న ఎల్కతుర్తిలో తలపెట్టిన బహిరంగ సభ బీఆర్ఎస్ కుంభమేళాకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. శనివారం మంచిర్యాల జిల్లా మందమర్రిలో రజతోత్సవ వేడుకల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఆదివారం 25వ వార్షికోత్సవ వేడుకలకు చెన్నూరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని, గద్దెనెక్కి 17నెలలు గడిచినా హామీల అమలు మాత్రం జరగడం లేదన్నారు. మహిళలకు 2500 నెలకు ఇవ్వడం లేదని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వడం లేదని, రూ.15వేల రైతు భరోసా అందడం లేదని, రూ.4వేల పింఛన్ అమలు కావడం లేదని, అలాంటి కాంగ్రెస్ సర్కార్ ను నిలదీయాలన్నారు. కేసీఆర్ తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అని ప్రజలు నమ్ముతున్నారన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఐక్యతను చాటాలి.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్



కరీంనగర్, ఏప్రిల్ 26: ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిన బడుగు బలహీన వర్గాలు ఆత్మగౌరవం కోసం ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు.

పార్టీలకతీతంగా అందరం ఐక్యతగా ఉండి అభివృద్ధి కోసం కృషి చేయాలని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయశంకర్, ఆలె నరేంద్ర, శ్రీకాంతాచారి, పోలీస్ కృష్ణయ్య లాంటి ఎందరో బహుజన నాయకులు పోరాట స్ఫూర్తిని తీసుకోవాలన్నారు. యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలలో రాణించాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లుతో కొంత న్యాయం జరిగిందన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామోజీ రాజకుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పెసరి శ్రీనివాస్, గంగుల లింగం, కుమార్ యాదవ్, లింగమూర్తి, శివాంజనేయులు, సంపత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్పీఎల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26: మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మక్తల్ సూపర్ ప్రీమియర్ లీగ్ (ఎంఎస్పిఎల్) టోర్నమెంట్ ను ఇవాళ స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? క్రీడాకారులకు పుట్టినిల్లు మక్తల్ పట్టణమన్నారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్బాల్, కబడ్డీ క్రీడల్లో క్రీడాకారుల సందడి కనిపించేదన్నారు. క్రీడా మైదానాన్ని ఇక నుండి క్రీడాకారుల సందడితో మార్చాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల వల్ల అనేక లాభాలున్నాయని, ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. స్టేడియం నిర్మాణంలో కుంచించుకుపోయిన క్రీడా మైదానాన్ని తిరిగి నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో గెలుపు ఓటములను స్వీకరించాలని ఆయన సూచించారు. పూర్తిస్థాయిలో క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి క్రికెట్, వాలీబాల్, ఫుట్బాల్, ఇండోర్ స్టేడియాలను అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఎంఎస్పీఎల్ నిర్వాహకులు కోళ్ళ వెంకటేష్ తదితరులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభినందించారు. బహుమతుల ప్రధానోత్సవానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని పిలిపించి స్టేడియం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జి.లక్ష్మారెడ్డి, నిర్వాహకులు కోళ్ల వెంకటేష్, సిఐ రామ్ లాల్, ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి, నాయకులు చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్ కుమార్, కావాలి తాయప్ప, కావలి శ్రీహరి, యగ్నేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# కలహాలొద్దు.. కలిసి ముందుకెళ్దాం.. నీలం మధు ముదిరాజ్



మెదక్, ఏప్రిల్ 26: మత్స్యకారులు సభ్యత్వాల విషయంలో కలహాలు లేకుండా కలిసికట్టుగా ముందుకు పోవాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలు బీసీ డి నుంచి బీసీ ఎ, రాజకీయ, ఉద్యోగ, ఆర్థిక పరమైన విషయాలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని శనివారం హైదరాబాద్ లోని వారి నివాసంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, వివిధ ముదిరాజ్ సంఘ నాయకులతో నీలం మధు కలిశారు. ఈవిషయంలో సానుకూలంగా స్పందించిన వేం నరేందర్ రెడ్డి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు.

అనంతరం నీలం మధు మాట్లాడుతూ? మత్స్యకారులకు సభ్యత్వ నమోదులో పలు సామాజిక వర్గాల మధ్య ఎదురవుతున్న ఇబ్బందులపై స్పందించారు. కలహాలు లేకుండా కలిసి ముందుకు సాగితేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో మత్స్య సంపద పెరుగుదలకు లోటులేదని, ప్రతిఒక్కరూ భేషజాలకు పోకుండా సమస్యను పరిష్కరించుకుందామన్నారు. జీవో ఏం ఎస్ 98/1964 ప్రకారం ముందుకు వెళ్తే సమస్య పరిష్కారానికి మార్గం సులువవుతుందని అభిప్రాయపడ్డారు. సామాజిక వర్గాల మధ్య చిన్న చిన్న బేధాభిప్రాయాలతోనే సమస్య ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సభ్యత్వంలో ఎదురవుతున్న ఇబ్బందుల వలన హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఫైవ్ మెన్ కమిటీ ముందు ప్రతి ఒక్కరూ బేదాభిప్రాయాలు లేకుండా తమ వాదనను వినిపించాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులందరికీ న్యాయం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. త్వరలో మత్స్యకార సామాజిక వర్గాలంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మన దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. తాము ముందుండి మన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని నాయకులు ప్రకటించారు. ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే రాజకీయ, ఆర్థిక అభ్యున్నతి సాధ్యపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి మన అందరి హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉప్పరి నారాయణ, చొప్పరి శంకర్, డీఎల్ పాండు, నీలకంఠం, ప్రభాకర్, గుండ్లపల్లి శ్రీనివాస్, బలరామ్, రమేష్, మద్దెల సంతోష్, గొడుగు శ్రీను, సురేందర్, లక్ష్మణ్, యాదగిరి, శివ, సుంకరబోయిన మహేష్, సతీష్, అశోక్, మాణిక్యరావ్, నారబోయిన శ్రీనివాస్, రాములు, ముదిరాజ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని ఎదుర్కోవడంలో భారతదేశం సాధించిన విజయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:గత దశాబ్దంలో అత్యంత అద్భుతమైన విజయాలలో ఒకటిగా, భారతదేశం 171 మిలియన్ల మందిని తీవ్ర పేదరికం నుండి బయటకు తీసుకువచ్చింది. ప్రపంచ బ్యాంకు తన స్ప్రింగ్ 2025 పేదరికం మరియు ఈక్విటీ బ్రీఫ్‌లో పేదరికంపై భారతదేశం యొక్క నిర్ణయాత్మక పోరాటాన్ని గుర్తించింది. నివేదిక ప్రకారం, తీవ్ర పేదరికానికి అంతర్జాతీయ ప్రమాణంగా ఉన్న రోజుకు 2.15 జూ డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే వారి నిష్పత్తి 2011–12లో 16.2 శాతం నుండి 2022–23లో కేవలం 2.3 శాతానికి బాగా తగ్గింది.

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలపై దృష్టి సారించి, సమగ్ర అభివృద్ధికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ విజయం నిదర్శనం. లక్ష్యంగా చేసుకున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక సంస్కరణ లు మరియు అవసరమైన సేవలకు ప్రాప్యతను పెంచడం ద్వారా, భారతదేశం పేదరిక స్థాయిలను తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించింది. ప్రపంచ బ్యాంకు యొక్క వసంత 2025 పేదరికం మరియు ఈక్విటీ బ్రీఫ్ ఈ ప్రయత్నాలు లక్షలాది మంది జీవితాలను ఎలా గణనీయంగా ప్రభావితం చేశాయో, దేశవ్యాప్తంగా పేదరిక అంతరాన్ని ఎలా తగ్గించాయో హైలైట్ చేస్తుంది.

ప్రపంచ బ్యాంకు యొక్క పేదరికం మరియు ఈక్విటీ బ్రీఫ్స్ యొక్క అవలోకనం

ప్రపంచ బ్యాంకు నుండి వచ్చిన పేదరికం మరియు ఈక్విటీ బ్రీఫ్స్ 100 కంటే ఎక్కువ అభివృద్ధి చెందుతున్న దేశాలకు పేదరికం, భాగస్వామ్య శ్రేయస్సు మరియు అసమానతలలో ధోరణులను హైలైట్ చేస్తాయి. ప్రపంచ బ్యాంకు గ్రూప్ మరియు అంతర్జాతీయ ద్రవ్య నిధి యొక్క వసంత మరియు వార్షిక సమావేశాల కోసం సంవత్సరానికి రెండుసార్లు ప్రచురించబడే ఈ బ్రీఫ్‌లు, ఒక దేశం యొక్క పేదరికం మరియు అసమానత సందర్భం యొక్క స్నాప్‌షాట్‌ను అందిస్తాయి, పేదరికం తగ్గింపు ప్రపంచ ప్రాధాన్యతగా ఉండేలా చూస్తాయి. ప్రతి ఖఇఃలో రెండు పేజీల సారాంశం ఉంటుంది

# 15వ రోజ్‌గార్ మేళాలో 976 మంది కొత్త నియామకాలకు నియామక లేఖలను EPFO అందజేసింది




న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO , దేశవ్యాప్తంగా 47 ప్రదేశాలలో ఈరోజు జరిగిన 15వ ఎడిషన్ రోజ్‌గార్ మేళాలో గర్వంగా పాల్గొంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించిన ఈ కార్యక్రమంలో ఇఖఈఖాతో సహా వివిధ ప్రభుత్వ విభాగాలలో కొత్తగా చేరిన యువతకు 51,000 కంటే ఎక్కువ నియామక లేఖలను పంపిణీ చేశారు.

ఈ ముఖ్యమైన నియామక కార్యక్రమంలో భాగంగా, EPFO తన శ్రామిక శక్తిని బలోపేతం చేయడానికి కొత్త నియామకాలను స్వాగతిస్తుంది, భారతదేశం అంతటా లక్షలాది మంది చందాదారులకు సామాజిక భద్రతా సేవలను సమర్థవంతంగా అందజేసేలా చేస్తుంది. 345 మంది అకౌంట్స్ అధికారులు/ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరియు 631 మంది సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లకు నియామక లేఖలు ఈరోజు జారీ చేయబడ్డాయి.

కొత్తగా నియమితులైన సిబ్బంది, బలమైన మరియు సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ అనే ప్రభుత్వ దార్శనికతకు మద్దతు ఇపిఎఫ్ఓ యొక్క ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ మరియు బీమా ప్రయోజనాలను అందించే లక్ష్యానికి దోహదపడతారు.

క్రమబద్ధమైన నియామకాలను నిర్ధారించడానికి EPFO ప్రధాన కార్యాలయంలో నియామక నిలువు వరుసలను ఏర్పాటు చేసింది మరియు కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఆదేశాలకు అనుగుణంగా నియామక క్యాలెండర్‌ను అభివృద్ధి చేసింది.

గత ఒక సంవత్సరంలో, EPFO 159 అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు, 84 జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్లు, 28 స్టెనోగ్రాఫర్లు, 2674 ఎస్ఎస్ఏ లను నియమించింది.

APFCలు, EO/AO, PAలు మరియు ASOనియామకాలు కొనసాగుతున్నాయి.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం మరియు దేశ నిర్మాణం కోసం యువతకు సాధికారత కల్పించడం అనే ప్రధానమంత్రి నిబద్ధతకు అనుగుణంగా రోజ్‌గార్ మేళా జరుగుతుంది. EPFO పాల్గొనడం పారదర్శకత మరియు మెరిట్ ఆధారిత నియామకాలకు దాని అంకితభావాన్ని నొక్కి చెబుతుంది, సేవా బట్వాడా మెరుగుపరచడానికి ఆధునికీకరించిన ప్రక్రియలను ఉపయోగించుకుంటుంది.

కొత్తగా నియామకమైన వారికి iGOT కర్మయోగి ప్లాట్‌ఫామ్ ద్వారా శిక్షణ లభిస్తుంది, అధికారిక శిక్షణతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మరియు వారి పాత్రలలో రాణించడానికి వీలు కల్పిస్తుంది.

ఇఖఈఖా నియామకం పొందిన వారందరికీ తన అభినందనలను తెలియజేస్తుంది మరియు భారతదేశ సామాజిక భద్రతా చట్రాన్ని ఉన్నత శిఖరాలకు నడిపించే భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని పెంపొందించాలనే తన సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తుంది.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం కావాలి : తుమ్మల వీరారెడ్డి




నల్గొండ, ఏప్రిల్ 26:నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి విరుద్ధంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు పెద్ద కుట్ర చేస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20న 11 కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కార్మికుల హక్కుల కోసం రక్తం చిందించి, హక్కులను పోరాడి సాధించుకున్న మే1న ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని మండలంలోని అన్నిగ్రామాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రైవేటీకరణతో సామాజిక న్యాయం దెబ్బతింటుందని, రిజర్వేషన్లు రద్దు అవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మళ్లీ పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విధానాలపై కార్మిక వర్గం ప్రతిఘటనే మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మె అన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, రైతు సంఘం జిల్లా నాయకుడు సాగర్ల మల్లేశ్, డీవైఎఫ్ఐ జిల్లా సహా కార్యదర్శి మిర్యాల భరత్, రైతు సంఘం మండల కార్యదర్శి వేముల లింగస్వామి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జీడిమడ్ల సైదులు, ఎర్ర అరుణ, ఎన్ లక్ష్మి, నీరుడు రాజ్యలక్ష్మి, ఎన్.పెద్దమ్మ, సంపూర్ణ, లలిత, సరిత, టి.ధనలక్ష్మి, ఎన్.వసుమతి, ఎన్.లింగమ్మ, పి.పద్మ, సీహెచ్.గంగ పాల్గొన్నారు.

# సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : షీ టీమ్ మెంబర్స్

హైదరాబాద్, ఏప్రిల్ 26: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని హస్నాబాద్ షీ టీమ్ బృందం ప్రజలకు సూచించింది. పట్టణ పరిధిలోని ఆరపల్లిలో ఇవాళ సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మాటలు నమ్మవద్దని, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని, సెల్‌ఫోన్‌కు బానిస కావొద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్స్ ప్రశాంతి, కృష్ణతోపాటు ఆరపల్లివాసులు గొర్ల కొమురయ్య, మ్యాదరబోయిన శ్రీకాంత్, గొర్ల నాగయ్య, గంగుల రాజయ్య తదితరులు ఉన్నారు.

# 2025లో జరిగిన 11వ బ్రిక్స్ కార్మిక & ఉపాధి మంత్రుల సమావేశం బ్రెజిలియన్ అధ్యక్షతన ప్రకటనను ఆమోదించింది




న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:2025 ఏప్రిల్ 25న బ్రెజిలియాలో బ్రెజిల్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ కార్మిక ఉపాధి మంత్రుల సమావేశంలో కేంద్ర కార్మిక ఉపాధి సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. "మరింత సమగ్ర మరియు స్థిరమైన పాలన కోసం గ్లోబల్ సౌత్ సహకారాన్ని బలోపేతం చేయడం" అనే నినాదంతో జరిగిన ఈ సమావేశం, "కృత్రిమ మేధస్సు మరియు పని యొక్క భవిష్యత్తు" మరియు ''పని ప్రపంచంపై వాతావరణ మార్పుల ప్రభావాలు మరియు న్యాయమైన పరివర్తన" అనే రెండు కీలకమైన ఇతివృత్తాలను ఉద్దేశించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక ప్రకటనను ఆమోదించడంలో ముగిసింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ "టెక్నాలజీ ఫర్ సాధికారత, నాట్ ఎక్స్‌క్లూజన్" అనే దార్శనికతకు అనుగుణంగా, సాంకేతిక పరివర్తనకు భారతదేశం యొక్క మానవ–కేంద్రీకృత విధానాన్ని సుశ్రీ కరండ్లాజే హైలైట్ చేశారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ మరియు విద్యలో నైతిక స్వీకరణ, శ్రామిక శక్తి పెంపు మరియు రంగాల అనువర్తనాలకు ప్రాధాన్యతనిచ్చే భారతదేశం యొక్క ౦ఎ కోసం జాతీయ వ్యూహాన్ని ఆమె హైలైట్ చేశారు. ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ మరియు నమో డ్రోన్ దీదీ కార్యక్రమం వంటి కార్యక్రమాలు ముఖ్యంగా గ్రామీణ మహిళలు మరియు యువతకు సాంకేతికత ఆధారిత జీవనోపాధిని సృష్టించడంలో భారతదేశం యొక్క నిబద్ధతను వివరిస్తాయి. ౦ఎ ద్వారా ఆధారితమైన నేషనల్ కెరీర్ సర్వీస్ ప్లాట్‌ఫామ్, నైపుణ్య అంతరాలను తగ్గించడానికి మరియు లక్షలాది మందిని ఉపాధి అవకాశాలకు అనుసంధానించడానికి ఒక నమూనాగా ప్రదర్శించబడింది.

వాతావరణ చర్యపై, భారతదేశం ఇది కేవలం పరివర్తన చట్రం అని నొక్కి చెప్పింది, ఆకుపచ్చ వృద్ధిని సమానమైన ఉద్యోగ సృష్టిగా మారుస్తుందని నిర్ధారించింది. సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ జాబ్స్ మరియు మిషన్ లైఫ్ఇ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) నైపుణ్యం మరియు స్థిరమైన పద్ధతులను నడిపించే పరివర్తనాత్మక చొరవలుగా హైలైట్ చేయబడ్డాయి. భారతదేశం ఉఊఉ ఉద్గారాలను తగ్గించడం (2020–2019) సాధించడం మరియు 2070 నాటికి నికర–సున్నా అనే దాని ప్రతిజ్ఞ దాని వాతావరణ నాయకత్వాన్ని బలోపేతం చేసింది. ఈ పరివర్తన సమయంలో కార్మికుల హక్కులను రక్షించడానికి ఎఖాతో సహకార ప్రయత్నాలు కూడా నొక్కి చెప్పబడ్డాయి

# రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానాలు విధించండి.. డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు




హైదరాబాద్, ఏప్రిల్ 26:జిహెచ్ఎంసి పరిధిలోని దుకాణదారులు రోడ్లపై చెత్త వెయ్యకుండా అవగాహన కల్పించాలని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఎస్ఎఫ్ఏలను ఆదేశించారు. శనివారం జిహెచ్ఎంసి కార్యాలయంలో ఆయన ఎస్ఎఫ్ఏలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రతి దుకాణదారుడు రెండు చెత్త డబ్బాలను వినియోగించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వెయ్యకుండా చెత్త డబ్బాలను ఉపయోగించాలన్నారు. ఒకవేళ ఏ దుకాణదారుడైన రోడ్లపై చెత్తను వేస్తే రూ. 1000 నుంచి రూ. 5000ల వరకు జరిమానాలను విధించాలని ఆదేశించారు. రెండో సారి అదే తప్పు చేస్తే రెట్టింపులో జరిమానాలను విధించాలని లేదా దుకాణదారుడి లైసెన్స్ ను రద్దు చేయాలని తెలిపారు. ఈ ఆదేశాలపై దుకాణదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం ఒక్కో వార్డుకు ముగ్గురితో కూడిన రెండు టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాణిజ్య దుకాణాలకు సంబంధించి ఏఎమ్‌హెచ్ఓ చూస్తారని తెలిపారు.

# ఈశాన్య రాష్ట్రాలతో ప్రాంతీయ విద్యుత్ సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26:ఏప్రిల్ 26న గ్యాంగ్‌టక్‌లో సిక్కిం ముఖ్యమంత్రి శ్రీ ప్రేమ్ సింగ్ తమంగ్ మరియు కేంద్ర విద్యుత్ మరియు గృహనిర్మాణ ఉ పట్టణ వ్యవహారాల మంత్రి శ్రీ మనోహర్ లాల్ సమక్షంలో విద్యుత్ రంగ ప్రాంతీయ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో శ్రీ రతన్ లాల్ నాథ్ (విద్యుత్ మంత్రి, త్రిపుర), శ్రీ ఎ టి మండల్ (విద్యుత్ మంత్రి, మేఘాలయ), శ్రీ ఎఫ్. రోడింగ్లియానా (విద్యుత్ మంత్రి, మిజోరాం), శ్రీ జిక్కే టాకో, ఎమ్మెల్యే కమ్ అడ్వైజర్ పవర్ (అరుణాచల్ ప్రదేశ్), శ్రీ సంజీత్ ఖరేల్ (విద్యుత్ సలహాదారు, సిక్కిం) కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర విద్యుత్ కార్యదర్శి, పాల్గొనే రాష్ట్రాల కార్యదర్శులు (విద్యుత్/ఇంధనం), కేంద్ర మరియు రాష్ట్ర విద్యుత్ వినియోగాల సిఎండిలు మరియు విద్యుత్ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్ తన ప్రసంగంలో, అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంలో దేశ వృద్ధికి ఇంధనంగా భవిష్యత్తుకు సిద్ధంగా, ఆధునికంగా మరియు ఆర్థికంగా లాభదాయకంగా ఉండే విద్యుత్ రంగం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విక్షిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో విద్యుత్తు యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఈశాన్య రాష్ట్రాల విద్యుత్ రంగానికి సంబంధించి నిర్దిష్ట సవాళ్లు మరియు పరిష్కారాలను గుర్తించడంలో ప్రాంతీయ సమావేశం సహాయం దుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రస్తుత విద్యుత్ అవసరాలను తీర్చడంలో 0.1% స్వల్ప అంతరం ఉన్నప్పటికీ, భవిష్యత్ డిమాండ్లను తీర్చడానికి ప్రయత్నాలు కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. 2014 నుండి, విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది మరియు థర్మల్, హైడ్రో, అణు మరియు పునరుత్పాదక శక్తితో సహా వివిధ ఉత్పత్తి పద్ధతులను ముందుకు తీసుకెళ్లాలి. నికర సున్నా ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడానికి పర్యావరణ సమస్యలను పరిష్కరించడం మరియు శిలాజ రహిత విద్యుత్ వైపు వెళ్లడం చాలా అవసరం.

RDSS మరియు PM-JANMAN వంటి ప్రభుత్వ పథకాల ద్వారా, పంపిణీ రంగంలోని ఇబ్బందులను పరిష్కరిస్తున్నామని మరియు వదిలివేయబడిన కుటుంబాలకు విద్యుదీకరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పేలవమైన సుంకాల నిర్మాణాలు, తక్కువ బిల్లింగ్ మరియు వసూళ్లు, ప్రభుత్వ శాఖ బకాయిలు మరియు సబ్సిడీల చెల్లింపులలో జాప్యం కారణంగా పంపిణీ రంగం సవాళ్లను ఎదుర్కొంటుందని మంత్రి హైలైట్ చేశారు. పంపిణీ రంగం ఆచరణీయంగా మారేలా చూసుకోవడానికి, యిడిఅ నష్టాలను మరియు సగటు సరఫరా వ్యయం మరియు గ్రహించిన సగటు ఆదాయం మధ్య అంతరాన్ని తగ్గించడం చాలా అవసరం. దానిని సాధించడానికి, సుంకాలు ఖర్చును ప్రతిబింబించేలా ఉండటం చాలా అవసరం.

# విదేశీ విద్యార్థులకు గుడ్ న్యూస్ - వీసా రద్దుకు బ్రేక్

వాషింగ్టన్, ఏప్రిల్ 26: వీసా రద్దు నిర్ణయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూ టర్న్? తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు విదేశీ విద్యార్థుల బహిష్కరణపై ట్రంప్ వెనక్కి తగ్గారు. తమ వీసాలు రద్దు చేయడంతో విదేశీ విద్యార్థులు అక్కడి న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో, విద్యార్థులకు అనుకూలంగా తీర్పులు రావడంతో ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు.

కోర్టుకెక్కిన విద్యార్థులు

ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు ఊరట లభించింది. అయితే, అమెరికాలో విదేశీ విద్యార్థులపై ట్రంప్ బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తమ వీసాల రద్దుపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. అనంతరం.. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ట్రంప్ యంత్రాంగం చర్యలను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు. దీంతో ఆయా విద్యార్థులకు చట్టబద్ధ హోదా లభిస్తుందన్నారు.

ఇదిలా ఉండగా.. విదేశీ విద్యార్థులపై బహిష్కరణ వేటు కారణంగా డిపోర్టేషన్, నిర్బంధం ముప్పు పొంచి ఉండటంతో ఆ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. తాజాగా కోర్టు వ్యాఖ్యలతో ట్రంప్ సర్కారు వెనక్కి తగ్గింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఉండ్రుగొండలో ఉమా మహేశ్వరుడికి రుద్రాభిషేకం



నల్గొండ, ఏప్రిల్ 26:సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం ఉండ్రుగొండ గిరిదుర్గంలో కొలువై ఉన్న ఉండ్రుగొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ ఉమా మహేశ్వర స్వామికి చైత్రమాస శివరాత్రి సందర్భంగా శనివారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ మంత్రమూర్తి మనోహం శర్మగారి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 26:దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మహిళా సభ వొకేషనల్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతి అని వివరించారు.

రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

